

మమ్మేల్‌మురుగన్!

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గుడుపల్లెలోని గుడివంక ఆలయానికి భక్తులు పోటెత్తారు. - 8లో



నాల్గో'సారీ'

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జెడ్పీ నాల్గో సర్వసభ్య సమావేశమూ తూతూమంత్రంగా సాగింది. - 8లో



మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా

మొగిలి ఘాట్ వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం వేకువ జామున లారీ అదుపు తప్పి బోల్తా పడింది. - 8లో

న్యూస్‌రీల్

ఓరియంటేషన్లు నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 20, 21 తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు శనివారం డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 20వ తేదీన మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై, ఈనెల 21న బాలికల కౌమార సమస్యలపై మహిళా ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

187 పింఛన్ల తొలగింపు

గుడిపాల: మండల పరిధిలో 187 పింఛన్లను తొలగించినట్లు ఎంపీడీఓ శిరీషా తెలిపారు. ఆమె మాట్లాడుతూ వికలాంగులు, మానసిక రోగులకు సంబంధించిన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు సరిగ్గా లేనందున పింఛన్లు తొలగించినట్లు వివరించారు. మండలంలో వికలాంగులు, మానసిక రోగులు తదితరులు 838 మంది ఉన్నారని, అందులో సర్టిఫికెట్లు సరిగా ఉన్న వారు 651 మంది మాత్రమేనని పేర్కొన్నారు. పింఛన్లు తొలగించిన వారిలో 189 కొత్తపల్లెలో 14 మంది, 197రామాపురంలో 16, ఎఎల్‌పురం 07, బసవాపల్లె 13, బొమ్మసముద్రం 10, చీలాపల్లె 13, చిత్తపార 25, గుడిపాల 07, నంగమంగళం 16, మరకాలకుప్పం 01, నారగల్లు 07, పానాటూరు 22, పాపసముద్రం 12, పేయనపల్లె 04, రామభద్రాపురం 07, వసంతాపురం 11 మంది ఉన్నట్లు వెల్లడించారు.

నిత్యావసర సరుకుల వితరణ



సరుకులు అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శనివారం ఓ దాత నిత్యావసర సరుకులు వితరణ చేశారు. తవణంపల్లి మండలం, మైనగుండ్లపల్లి గ్రామానికి చెందిన అంజిరెడ్డి రూ.2.5 లక్షల విలువ చేసే బియ్యం 5 టన్నులు, నూనె, కూరగాయలు అందజేశారు. అనంతరం వారికి ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి పాల్గొన్నారు.



దివ్యాంగులకు వాత!



• ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు దిలీప్. ఐరాల మండలం, గుండపల్లి గ్రామం. కొన్నేళ్ల కిందట నాలుగు అంతస్తుల భవనం నుంచి పడిపోయాడు. అప్పటి నుంచి వెన్నెముక, రెండు కాళ్లు పనిచేయవు. పూర్తిగా నడవలేడు. అప్పట్లో సదరన్‌కు దరఖాస్తు చేసుకోగా వైద్యులు పరీక్షించి 87 శాతం వికలత్వం ఉన్నట్లు నిర్ధారించారు. మూడు నెలల కిందట అధికారులు, వైద్యులు వచ్చి ఇంటి వద్దే పరీక్షించారు. దిలీప్‌కు ఎలాంటి సమస్యా లేదని రిపోర్ట్ ఇచ్చారు. ఇతడు పింఛన్ కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



• ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి పూతలపట్టు మండలం బి.కొత్తకోట గ్రామానికి చెందిన నరేష్. ఇతడికి రెండు కాళ్లు సచ్చుబడిపోయాయి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే అయనకు 85 శాతం వికలత్వం ఉన్నట్లు సదరన్ సర్టిఫికెట్ జారీచేసింది. ప్రస్తుతం మూడు చక్రాల వాహనంతో బయటకు వస్తున్నాడు. ఆ మూడు చక్రాల బండి కూడా ప్రభుత్వం ఇచ్చిందే. ఉన్నట్టుండి పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

• ఈ ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు షామీర్ బాషా. తగ్గువారిపల్లి, ఇందిరమ్మ కాలనీకి చెందిన వాడు. బజ్జీల కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. 2014లో ఇంటి పనిచేస్తూ పడిపోయాడు. వెన్నెముక దెబ్బతినడంతో కాళ్లు, చేతులు సచ్చుబడ్డాయి. అప్పటి నుంచి మంచానికే పరిమితమైపోయాడు. కుటుంబీకులు దగ్గరుండి చూసుకుంటున్నారు. 90 శాతం సదరన్ ధ్రువీకరణ పత్రంతో పింఛన్ పొందుతున్నాడు. రీ వెరిఫికేషన్‌లో లోపం 40 శాతం కంటే తక్కువగా ఉందని రిపోర్ట్ ఇచ్చారు. పింఛన్‌కు అనర్హుడిగా వేటు వేశారు. ఇలాంటి పరిస్థితులో తాము ఏం చేయాలని కుటుంబీకులు రోదిస్తున్నారు.



...ఇవి మచ్చుకు మూడు ఘటనలు మాత్రమే. జిల్లాలో ఇలాంటి వారు చాలా మందే ఉన్నారు. కనికరం లేని కూటమి ప్రభుత్వం దివ్యాంగుల నోటికూడు లాగేస్తోంది. రీ వెరిఫికేషన్ పేరుతో వేలాది పింఛన్లను అడ్డగోలుగా తొలగించేస్తోంది. సచివాలయ వారీగా తొలగింపు జాబితాను పంపింది. అనర్హులంటూ పలువురికి సచివాలయ సిబ్బంది నోటీసులిస్తున్నారు. చేసేది లేక దివ్యాంగులు కంటతడి పెడుతున్నారు. పింఛన్లు నమ్ముకుని జీవించే తమకు ఈ కోతలేమిటని కన్నీరుమున్నీరవుతున్నారు.

దివ్యాంగుల పింఛన్లపై కూటమి కన్ను

- జిల్లాలో సదరన్ రీ వెరిఫికేషన్ పేరిట కుట్ర
- 4,732 సదరన్ పింఛన్లు కోత పెట్టిన కూటమి ప్రభుత్వం
- లబోదిబోమంటున్న బాధితులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఆశ చూపించింది. ఎన్నికలయ్యాక ఆ మొత్తం పెంచినట్టే పెంచి కోతలు పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ ముసుగులో వేలాది పింఛన్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లా ప్రభుత్వాస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో రీ వెరిఫికేషన్ పేరిట దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ పరీక్షల్లో పలువురిని అనర్హులుగా గుర్తించి వేటు వేసింది.

పింఛన్లు తొలగింపు

2024 డిసెంబర్ నుంచి సదరన్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పింఛన్ తీసుకుంటున్న వారు 1,936 మంది ఉంటే 1,911 మందిని రీ వెరిఫికేషన్ చేశారు. ఈ పరిశీలనలో 1,677 మంది అర్హులుగా తేలితే 234 మందిని అనర్హులుగా తేల్చారు. అలాగే దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి మొత్తం 35,277 మంది ఉంటే 22,338 మందిని రీ వెరిఫికేషన్ చేశారు. వీరిలో ఇప్పటి వరకు అర్హులుగా 17,606 మంది కాగా అనర్హులుగా 4,732 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి పింఛన్ తొలగించేందుకు సర్వం సిద్ధం చేశారు. అత్యధికంగా చిత్తూరు అర్బన్‌లో 504, తవణంపల్లి మండలంలో 377, ఐరాలలో 267, యాదమరిలో 263 ఎస్‌ఆర్‌పురంలో 238, పెనుమూరులో 225, పుంగనూరులో 216, కార్వేటినగరంలో 189, చిత్తూరు మండలంలో 186, గుడిపాలలో 182 మందిని తొలగించినట్లు జాబితాలో పేర్కొన్నారు. ఇంకా 12,939 మందిని పునఃపరిశీలన చేయాల్సి ఉండగా మరిన్ని పింఛన్లు కోత పడే అవకాశం ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు.



సదరం రీ-వెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులు (ఫైల్)

నోటీసులు జారీ

అనర్హత పేరుతో దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గ్రామ సచివాలయాల ద్వారా నోటీసుల జారీమొదలైంది. ఈ నెల 27 నాటికి తొలగింపు ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. తొలగింపు తర్వాతనే సెప్టెంబర్ నెల పింఛన్ల పంపిణీకి సంబంధించిన డేటా విడుదలయ్యే అవకాశం ఉంది.

నా పింఛన్ తొలగించారు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి రూ.200 పింఛన్ మంజూరైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పింఛన్ అందుకుంటూ వచ్చాను. ఇప్పుడు సదరం సర్టిఫికెట్లు పర్సంటేజ్ తక్కువ ఉందని పింఛను తొలగించారు. నాకు జీవించడానికి ఎలాంటి ఆధారం లేదు. పింఛన్ పై ఆధారపడి జీవనం సాగిస్తున్నా.

– సురేంద్రబాబు, కార్వేటినగరం

జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి : యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 22వ తేదీ (శుక్రవారం) నుంచి 35 రోజుల పాటు మహిళలకు జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్‌పై ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళలు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ , రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎనిమిది ప్రతిపాదనలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న కొందరు టీచర్లకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా నుంచి ఎనిమిది ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలు-2, స్కూల్ అసిస్టెంట్లు-4, గ్రేడ్-2 హెచ్‌ఎంలు-2 మొత్తం ఎనిమిది ప్రతిపాదనలను పంపించాలన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకున్న టీచర్ల ప్రతిపాదనలను జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ నెల 14న ప్రత్యేక కమిటీతో పరిశీలించారు. అనంతరం శనివారం జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రతిపాదనలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపించారు. పంపిన ప్రతిపాదనల టీచర్లకు రాష్ట్ర స్థాయిలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అనంతరం ఎంపిక జాబితాను ఈనెల 25న ప్రకటించి సెప్టెంబర్ 5వ తేదీన రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులను అందజేయనున్నారు.

కావడి మొక్కులు చెల్లించిన

మాజీ మంత్రి ఆర్కే రోజా





వెండి శూలాయుధంతో మాజీ మంత్రి ఆర్కేరోజా, కావడితో కొండకు వస్తున్న మాజీ మంత్రి రోజా

–సుబ్రమణ్య స్వామికి వెండి శూలాయుధం సమర్పణ

నగరి : ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మాజీ మంత్రి ఆర్కేరోజా కావడి మొక్కులు చెల్లించారు. సంప్రదాయ పద్ధతిలో పసుపుచీర ధరించి సుబ్రమణ్యస్వామి వ్రతమాచరించిన ఆమె పుష్పాలతో అలంకరించిన కావడి ఎత్తారు. రాష్ట్ర సరిహద్దులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.తర్వాత మొక్కుబడిలో భాగంగా వెండి శూలాయుధాన్ని హుండీలో వేసి మొక్కు చెల్లించుకున్నారు. ఆమెను ఆలయ పురోహితులు ఆశీర్వదించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నాయకులు రమేష్‌రెడ్డి, మురుగ, ఆనంద్ కుమార్, కృష్ణమూర్తి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమాల నిప్పుకణిక సర్దార్ గౌతులచ్చన్న



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

- కలెక్టరేట్‌లో గౌతులచ్చన్న 116వ జయంతి
- పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యమాల నిప్పు కణిక సర్దార్ గౌతులచ్చన్న అని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లో గౌతులచ్చన్న 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేటి యువతకు సర్దార్ గౌతులచ్చన్న జీవితం ఆదర్శమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాటాలు చేసిన మహనీయులను గుర్తించుకోవడం మన కర్తవ్యంగా భావించాలన్నారు. 35 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, మంత్రిగా సేవలందించిన మహనీయుడు సర్దార్ గౌతులచ్చన్న అని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమం, జమీందారి వ్యతిరేక పోరాటం, హరిజన సేవ, మద్యపాన నిషేధం వంటి రంగాల్లో లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ గౌడు లచ్చన్న స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. చిత్తూరు నగరంలోని ఇరువారంలో వచ్చే సంవత్సరం లోపు గౌతు లచ్చన్న పేరుతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామన్నారు. నగర మేయర్ అముద, చుడా చైర్మన్ హేమలత, మొదలియార్ సంఘం అధ్యక్షుడు త్యాగరాజన్, బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, డీఆర్‌వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిబాషా, తదితరులు పాల్గొని లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

నన్ను చూస్తే...జాలి లేదా?

- బంగారుపాళ్యంకు చెందిన హర్షద్‌కు పుట్టుకతోనే పక్షవాతం
- పూర్తిగా మంచానికే పరిమితం
- రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్ తొలగింపు
- బోరుమంటున్న తల్లిదండ్రులు

కాణిపాకం: పుట్టుకతోనే పక్షవాతం. మంచానికే పరిమితం. ఇలాంటి దుస్థితిలో ఉన్న ఆ యువకుడిపై కూటమి ప్రభుత్వం కక్షగట్టింది. జాలి, దయ లేకుండా పింఛన్ తొలగించేందుకు చర్యలు చేపట్టింది. వివరాలు.. బంగారుపాళ్యం మండల కేంద్రానికి చెందిన సమ్మద్, సాహిన్ దంపతులు దినసరి కూలీలు. వీళ్లకు సొంత ఇల్లు లేదు. సెంటు జాగా లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ దంపతులకు ఇంటి స్థలం మంజూరు చేశారు. వీరి పెద్ద కుమారుడు హర్షద్ పుట్టుకతోనే పక్షవాతానికి గురయ్యాడు. పక్షవాతం నుంచి రక్షించేందుకు 19 సవరాల బంగారాన్ని అమ్మేశారు. అయినా కుమారున్ని పక్షవాతం నుంచి కాపాడలేకపోయారు. మందులు, మాత్రలతోనే ప్రాణంతో నిలబెడుతున్నారు. నెలవారీగా రూ.7,500 ఖర్చువుతోంది. 20 ఏళ్లు దాటినా అతని ఆలనాపాలన మొత్తం తల్లిదండ్రులే చూసుకుంటున్నారు. ఇప్పుడు అతనికి చూపు కూడా మందగించింది. ఈ దుస్థితిని గుర్తించి వైద్యులు 2013లో సదరన్ సర్టిఫికెట్ జారీచేశారు. అప్పటి నుంచి పింఛన్ మంజూరవుతోంది.



మంచానికే పరిమితమైన హర్షద్

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్ల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో భాగంగా ఐదుగురు అధికారులు బృందంగా ఇంటివద్దకు వచ్చి వికలత్వం 40శాతం కంటే తక్కువగా ఉందని నోటీసు ఇచ్చారు. దీంతో యువకుడి తల్లిదండ్రులు బోరుమని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

రాజనాలబండలో తిరుణాల సందడి

- ప్రత్యేక పూజలందుకొన్న వీరాంజనేయస్వామి
- లక్ష్మీనరసింహస్వామి కొండపైకి ఎక్కి మొక్కులు చెల్లించి భక్తులు
- ఏర్పాట్లు చేపట్టిన టీటీడీ అధికారులు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం నుంచి తిరుణాల సందడి మొదలైంది. పూర్వీకుల నుంచి శ్రావణమాసపు చివరి శనివారం, ఆదివారం భక్తి శ్రద్ధలతో తిరుణాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుణాలను పురస్కరించుకొని టీటీడీ అధికారులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. శనివారం మండలంలోని ప్రజలు, తిరుణాల నిర్వహించే సుమారు 18 గ్రామాల ప్రజలు, బంధుమిత్రులు భక్తి శ్రద్ధలతో రాజనాలబండకు చేరుకొని శ్రీవీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి రాజనాలబండకు సమీపంలో గల ఎత్తైన కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కాలినడకన చేరుకొని లక్ష్మీనరసింహస్వామి వారి స్వయంభు విగ్రహానికి అభిషేకాలు చేశారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కొండపై ఆహ్లాదకర వాతావారణం నడుమ సేద తీరారు. అనంతరం ఆలయం వద్ద శనివారం రాత్రి అఖండ దీపారాధన వెలిగించారు. రాజనాలబండ ఆలయం, లక్ష్మీనరసింహ స్వామి కొండపైకి నడిచి వెళ్తున్న భక్తులకు జీఆర్‌ఎస్ రమణయూత్, ఎస్‌ఎల్‌ఎన్ఎస్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి స్వయంభు



నరసింహస్వామి కొండ పై భక్తుల రద్దీ



భక్తులకు అన్నదానం చేస్తున్న జీఆర్‌ఎస్ యూత్

చెరువులో మట్టి తరలింపుపై కలెక్టర్, ఎస్పీ సీరియస్


చెరువులో మట్టిని తరలిస్తున్న జేసీబీలు, ట్రాక్టర్లు

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ, కొత్తూరుగ్రామ సమీపంలోని ఎర్రచెరువులో మట్టి తవ్వకాలపై మండల అధికారులు ఎవ్వరూ స్పందించక పోవడంతో కలెక్టర్, ఎస్పీ నేరుగా రంగంలోకి దిగారు. దీంతో అక్రమార్కులు ఉడాయించారు. దీనిపై ఫిర్యాదు చేసిన పెద్దపంజాణి సింగిల్ విండో మాజీ చైర్మన్ శంకరప్ప వివరాల మేరకు.. మండలంలోని ఎర్రచెరువులో శనివారం ఉదయం నుంచి అధికార పార్టీకి చెందిన ఓ చోటా నాయకుడు శ్రీరామాపురం సమీపంలోని లేఅవుట్‌కు మట్టి తోలేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. తాను అధికార పార్టీలో ఉన్నానని, తనను ఎవరు అడుగుతారంటూ మూడు జేసీబీలు, 20 ట్రాక్టర్లతో మట్టిని తరలించడం ప్రారంభించాడు. దీనిపై తహసీల్దార్, ఎస్‌ఐ, మైన్స్, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమార్కులకు కొమ్ముకాయడంతో తాను చేసేదేమి లేక కలెక్టర్, ఎస్పీకి ఫొటోలు, వీడియోలు పంపినట్టు ఆయన వివరించారు. చివరకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించడంతో విషయం తెలుసుకున్న చోటానాయకుడు వాహనాలతో సహా అధికారులు రాకముందే చెరువు నుంచి ఉడాయించాడని తెలిపారు.

మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం వేకువజామున లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కర్ణాటకలోని హసన్ నుంచి విజయవాడకు దానిమ్మ, ద్రాక్ష పండ్ల లోడుతో వెళ్తున్న లారీ మొగిలి ఘాట్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో భయటపడ్డారు. రహదారిపై లారీ బోల్తా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాకపోకలను పునరుద్ధరించారు.

మమ్మేల్ మురుగన్!


పుణ్య స్నానాలు ఆచరించి.. ఆలయానికి వెళ్తున్న భక్తులు

- హరోహర నామస్మరణతో మార్మోగిన గుడివంక
- పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన పశ్చిమ వాహిని కొండ

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రమణ్య స్వామి కొండ హరోహర.. వేల్ మురుగా.. నామస్మరణంతో మార్మోగింది. శనివారం ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. కావళ్లు ఎత్తుకుని పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచారించారు. అనంతరం స్వామి వారి నామస్మరణతో పశ్చిమ వాహిని కొండపైకి చెరుకున్నారు. కావళ్లను ఎత్తుకుని ఆలయం చట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వివిధ ఆకృతులతో కావళ్ల చెలింపు

కోరిన కోర్కెలు తీరిన భక్తులు స్వామి వారికి పలు ఆకృతులతో కావళ్ల ద్వారా మొక్కులు చెల్లించారు. తేరు కావళ్లు, రాగి గుండులు, ఇనుప శూలాలు, నిమ్మకాయలతో సూదులు శరీరానికి గుచ్చుకుని ఆలయం ఎదుట కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు ఎస్కాట్ వాహనంపై వీపుకు కొక్కిళ్లు వేసుకుని వెలాడుతూ వేల్ మురుగా అంటూ నినాదాలు చేస్తూ ఆలయం చట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

గుడివంకలో జన సందడి

ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూల్లో వేచి ఉండడం కనిపించింది. పశ్చిమ వాహిని నుంచి ఆలయం వరకు డప్పు వాయిద్యాల నడుమ కావళ్లు ఎత్తుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక అలంకరణంతో గంగాధరేశ్వరస్వామి

గుడివంక బ్రహ్మోత్సవాల సందర్భంగా గంగాధరేశ్వరస్వామిని ప్రత్యేక అలంకరణంతో భక్తులకు దర్శనం కల్పించారు. కొండపై సుబ్రమణ్య స్వామిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో భక్తులు గంగాధరేశ్వరస్వామిని దర్శించుకుని గ్రామాలకు తిరుగుప్రయాణమయ్యారు.


ఎస్కాట్‌లతో కావళ్లు చెల్లిస్తున్న భక్తులు


శూలాలతో వస్తున్న భక్తులు


తేరు కావళ్లతో భక్తుల సందడి


ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


దర్శనం కోసం క్యూలో కిక్కిరిసిన భక్తులు

నాల్గోసారీ!

- తూతూమంత్రంగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- రెండున్నర గంటల్లోనే ముగించేశారు
- కనిపించని పలువురు ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాదరి పక్కన సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ 4వ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. శనివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన, సీఈఓ రవికుమార్‌నాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జేసీ విద్యాదరి హాజరయ్యారు. ఇక సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆదిమూలం, మురళీమోహన్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మినహా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరు కాలేదు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభించగా మధ్యాహ్నం 1.30కు ముగించేశారు. అజెండాలో 11 అంశాలపై చర్చ జరపాల్సి ఉండగా.. అందులో రోడ్లు, వ్యవసాయం, విద్య, ఆర్యోగ శాఖలపై చర్చించి మిగిలిన వాటిని తూతూమంత్రంగా కానిచ్చేశారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి పలు శాఖల అధికారులు హాజరు కాలేదు. సభ్యుడు కానీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్ సమావేశానికి హాజరవ్వడం గమనార్హం.

50 ఏళ్లుగా ఇలాంటి పాలన చూడలేదు

ప్రజాప్రతినిధులంటే దిష్టిబొమ్మల్లా అధికారులకు కనపడుతున్నట్టు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఇలాంటి పిచ్చి తుగ్లక్ పాలన చూడలేదని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో తన చేతులమీదుగా ఇచ్చిన చెక్‌ను మరోసారి కార్యక్రమం పెట్టి ఇంకొకరి చేతుల మీదుగా వ్యవసాయశాఖాధికారులు ఇప్పించారన్నారు. పలు కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదన్నారు. ప్రొటోకాల్ పాటించని అధికారుల పై స్పీకర్, ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. గత పాలనలో రోడ్ల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో బాగా జరిగాయన్నారు. ప్రస్తుతం 36 రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వాపోయారు. ఆర్అండ్‌బీ బైపాస్ రోడ్డు మంజూరైనా పనులు చేయలేదని, సీకేపాడి, నాగలాపురం– శ్రీసిటీ, నాగలాపురం–టీపీకోట రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. చాలా రోడ్లపై కనీసం ఆర్టీసీ బస్సులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కేవీపురం మండలం, ఎగవ పూడిబ్రిడ్జి, నారాయణవనంలోని తంబూరు, పాలమంగళం బ్రిడ్జిలు దెబ్బతిన్నాయన్నారు. నాగలాపురం–సురటపల్లెకు వెళ్లే మార్గంలో మూడు కిలోమీటర్లు రోడ్డు వేయాల్సి ఉందన్నారు. జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో కనీసం ఫర్నిచర్ కూడా లేదన్నారు.

108 వాహనాలు లేవు

పలు ప్రభుత్వాస్పత్రుల్లో 102, 104, 108 వాహనాలు అందుబాటులో లేవని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర కేసులను దూరంగా ఉండే ప్రభుత్వాస్పత్రులకు కాకుండా సమీపంలో ఉండే నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సంఖ్యను పెంచాలని చెప్పారు. గ్రామాల్లో వేసిన బోర్లకు విద్యుత్ సర్వీసులు ఇవ్వడం లేదని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆరోపించారు.

సమస్యలు ఏకరువు

- తమకు గౌరవం ఎలాగో ఇవ్వడం లేదు.. కనీస వేతనం అయినా ఇవ్వాలని జెడ్పీటీసీలు, ఎంపీపీలు డిమాండ్ చేశారు.
- అధికార కార్యక్రమాలకు పిలవని సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జెడ్పీటీసీ సుమన్ కోరారు. - - శ్రీకాళహస్తి-కేకే రోడ్డు బాగాలేదని, పీలేరు-భాకరపేట దారి సరిలేదని జెడ్పీటీసీలు సుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి ఆరోపించారు.
- గత ప్రభుత్వంలో పీఎల్ఆర్ సంస్థకు మంజూరైన రోడ్లను ఎందుకు సగంలో ఆపివేశారని మదనపల్లె జెడ్పీటీసీ ఉదయ్ ప్రశ్నించారు.
- ఆర్.నడిమిపల్లెలో దానం ఇచ్చిన స్థలంలో ప్రభుత్వ స్కూల్ ఎత్తివేశారని ఆ స్థలం తిరిగి ఇవ్వాలని రామసముద్రం జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి అడిగారు.
- పలు పాఠశాలల ప్రహరీగోడలు కూలిపోయాయని విద్యార్థినులు టాయ్‌లెట్స్‌కు వెళ్లాలంటే ఎలా అని పెద్దమండ్యం జెడ్పీటీసీ పీరమ్మ ప్రశ్నించారు.
- చిత్తూరు చర్చి వీధిలోని దేవదాయశాఖ ఏసీ కార్యాలయాన్ని ఎందుకు 3 కిలోమీటర్లు దూరంలో ఉన్న సంతపేటకు మార్చారని కుప్పం జెడ్పీటీసీ శరవణ నిలదీశారు.
- మండలంలోని పాఠశాలలకు ప్రహరీగోడలు నిర్మించాలని గుడుపల్లె జెడ్పీటీసీ కృష్ణమూర్తి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే పార్థిబన్

గంగాధరనెల్లూరు: కారులో గత మంగళవారం తిరుత్తణికి వెళ్తూ ప్రమాదానికి గురై గాయపడి, రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. శనివారం తమిళనాడులోని రాణిపేట సీఎంసీకి తమిళనాడు రాష్ట్రం, షోలింగర్ మాజీ ఎమ్మెల్యే పార్థిబన్‌తో కలిసి చేరుకున్నారు. సీఎంసీ డైరెక్టర్ దీపక్ సెల్వంతో భేటీ అయ్యారు. ప్రమాద బాధితులకు ప్రత్యేక వైద్య సేవలందించాలని కోరారు. చిట్టెమ్మ, రేఖ, కీర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీకరరెడ్డి, రూపకుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు


కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అలీమ్‌బాషా, నాగభూషణం

పుంగనూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ పట్టణంలోని హనుమంతరాయునిదిన్నెలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, సీమ జిల్లాల మైనారిటీ సెల్ కన్వీనర్ ఫక్రుద్దీన్ షరీఫ్‌తో కలసి ఆయన కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసగిస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి, తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అమరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, కిజర్‌ఖాన్, రాజేష్, ఖాదర్ బాషా, ఖాదర్, మమ్ము, రేష్మా, అంజాద్, తులసమ్మ, సాజిదా, శ్రీనివాసులు, నజీర్, భారతి, ఇంతియాజ్, రాఘవేంద్ర, అస్లాంమురాధి పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జేవీవీ లక్ష్యం


జేవీవీ రాష్ట్ర సభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

పలమనేరు: శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డా.గేయానంద్ పేర్కొన్నారు. పలమనేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో జేవీవీ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు, సూడోసైన్స్, అశాస్త్రీయ భావజాలం విపరీతంగా ప్రచారమవుతోందన్నారు. వీటిని అరికట్టి శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలంటే యువత నడుం బిగించాలన్నారు. మరో అతిథి పలమనేరు బాలాజీ మాట్లాడుతూ నేటి సమాజంలో వ్యక్తుల మధ్య సంబంధాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక నేతలతో కలసి వారు సెప్టెంబర్ 13న విజయనగరంలో జరగనున్న జేవీవీ వార్షిక సమావేశపు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జేవీవీ జిల్లా నూతన కార్యవర్గం

జేవీవీ జిల్లా అధ్యక్షుడిగా అరుణశివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మిఠాయి యుగంధర్‌బాబు, కోశాధికారిగా గిరిధర్ మూర్తితోపాటు కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు మునిరత్నం, బాలచైతన్య, సుధాకర్, విజయకుమార్, ఆనందబెన్, సెల్వం, శ్యామల, రామలింగం పాల్గొన్నారు.

మురకంబట్టులో మద్యం పట్టివేత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మద్యం విక్రయిస్తుండంగా ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు తాలూకా ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. చిత్తూరు నగరంలోని మురకంబట్టు ప్రాంతంలో శుక్రవారం మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మురకంబట్టుకు చెందిన అర్జునన్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి దగ్గర నుంచి 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

పాదయాత్ర తాత్కాలికంగా రద్దు

పుంగనూరు: పట్టణంలో మాలమహానాడు, మాల ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించాల్సిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను రద్దు చేసినట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు నుంచి చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు పలమనేరు డీఎస్పీ అనుమతివ్వకపోవడంతో ఈ పాదయాత్రను తాత్కాలికంగా రద్దు చేసుకున్నట్లు తెలిపారు. తిరిగి పాదయాత్ర చేపట్టే తేదీని ప్రకటిస్తామని ఆ సంఘ సభ్యులకు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

చౌడేపల్లె: అనుమానాస్పద స్థితిలో కూలీ మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. కాగతి సమీపంలోని ప్రయివేటు హేచరీస్‌కు చెందిన కోళ్లఫారాలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఛత్తీస్‌ఘడ్ ప్రాంతానికి చెందిన నందకుమార్ యాదవ్ (38) కూలీగా పనిచేస్తున్నాడు. ఏం జరిగిందో తెలియదు గానీ కోళ్లఫారంలో అపస్మారక స్థితిలో పడిపోయాడు. కూలీలు గుర్తించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.